క్లుప్తంగా

చెత్తకుప్పల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

చిన్నగూడూరు: మండలంలోని మేఘ్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నతేజ, లాక్యతండా పరిసరాల్లో రోడ్ల వెంబడి పెంటకుప్పలతో 'పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కరువు' శీర్షికన సోమవారం ప్రచురితమైన సాక్షి కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. రోడ్ల వెంబడి డంపింగ్ చేసిన పెంటకుప్పలను డోజర్ సహాయంతో అధికారులు సిబ్బందితో తొలగించారు. రోడ్ల వెంబడి చెత్తాచెదారం, పెంటకుప్పలతో డంపింగ్ చేస్తే జరిమానా విధిస్తామని పంచాయతీ అధికారులు తండావాసులకు సూచించారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నెహ్రూసెంటర్: జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ ముఖ్య భూమిక పోషిస్తున్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ అంబరీష అన్నారు. తెలంగాణ హెల్త్ ఎడ్యుకేటర్స్, మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను డీఎంహెచ్ఓ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మురళీధర్, పీఓ సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్, డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ సెక్రటరీగా కమలాకర్



కురవి: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) డోర్నకల్ నియోజకవర్గ సెక్రటరీగా సీరోలు మండల కేంద్రానికి చెందిన మండడి కమలాకర్‌ను నియమించినట్లు బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు బాషిపంగు మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గూడూరు ఎస్సైగా నగేష్

గూడూరు: గూడూరు ఎస్సైగా సీహెచ్ నగేష్ సోమవారం బాధ్యతలు చేపట్టాడు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్సై రాణాప్రతాప్ ఇటీవల జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యాడు.

'అవిశ్వాస పత్రాన్ని వెనక్కి తీసుకోవాలి'

మహబూబాబాద్: మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాన పత్రాన్ని వెనక్కి తీసుకోవాలని మైనార్టీ నాయకులు రఫిక్, జావిద్, అమీర్, మోసీన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఫరీద్‌పై అవిశ్వాసం పెట్టడం సరికాదన్నారు. చైర్మన్‌ను వదిలి వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఈ విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. అవిశ్వాస తీర్మానానికి దూరంగా ఉన్న సీపీఐ కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



డోర్నకల్: మహిళలు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉంటాలని ఏపీజీవీబీ డోర్నకల్ బ్రాంచి మేనేజర్ విజయకుమారి కోరారు. స్థానిక ఏపీజీవీబీ బ్రాంచ్‌లో నాబార్డ్ ఆర్థిక సౌజన్యంతో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ఎం.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాజాత బృందం బ్యాంకు సేవలు, పంట రుణాలు, బీమా పథకాలు, బంగారంపై రుణాలపై మహిళలకు అవగాహన కల్పించారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు



డోర్నకల్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

మహబూబాబాద్ రూరల్: మానుకోటలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మానుకోట హిందూ సేన, మహారాజా హిందూ సేన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మరిపెడ రూరల్: నేటి యువతకు ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ అని సీఐ బానోతు కాశీరాంనాయక్ పేర్కొన్నాడు. మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అల్వాల రమేష్, ఉపాధ్యక్షుడు ఆవుల గోవర్ధన్, దండె బుచ్చిరాములు, ప్రధాన కార్యదర్శి గుండా దశరథ, బత్తెం అశోక్, గండి సాయిబాబు, ఉమేష్, మహేష్, కొంపెల్లి నాగరాజు, చిన్నసాయిబాబు పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో శివాజీ జయంతి వేడుకలను యువజన సంఘం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బైక్‌ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు రమేష్, దశరథం, వంశీ, చింటూ, సందీప్, రాజేందర్, ప్రశాంత్, హరీశ్ పాల్గొన్నారు.

గూడూరు: యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, అరవింద హైస్కూల్ కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శివాజీ యువసేన ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు మురళీ, వంశీ, రాజు, శివ, మనోజ్, శాంతివర్ధన్, అఖిల్, సాయి, నితిన్, రంజిత్ పాల్గొన్నారు.

తొర్రూరు: ఛత్రపతి శివాజీ పోరాటం స్ఫూర్తిదాయకమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. డివిజన్ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు కొలుపుల శంకర్, రాజేష్, ఉపేందర్, రాజ్‌కుమార్, రాజు, గణేశ్, రాజ్‌కుమార్, సిద్ధులు, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మానుకోట హిందూ సేన ఆధ్వర్యంలో..



మరిపెడ రూరల్: ఎల్లంపేటలో నివాళులర్పిస్తున్న సీఐ, యూత్ సభ్యులు



గూడూరు: శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు



తొర్రూరూ రూరల్: గుర్తూరులో..



తొర్రూరులో..

ఆలయ నిర్మాణానికి సహకరించండి

గూడూరు: మండలంలోని అయోధ్యపురం గ్రామంలోని పురాతన శివాలయం ప్రాంగణంలో జరిగిన తవ్వకాల్లో సోమవారం నంది విగ్రహం బయటపడింది. రెండు సంవత్సరాల క్రితం అదే ప్రదేశంలో గ్రామస్తులు జరిపిన తవ్వకాల్లో సనాతన శివాలయ ఆనవాళ్లు కనిపించాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. తిరిగి మళ్లీ అదే ప్రదేశంలో నంది బయటపడడంతో దేవాదాయ శాఖ అధికారులకు తెలియజేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత విగ్రహం బయట పడిన ప్రదేశాన్ని సందర్శించారు. అక్కడ గతంలో లభించిన శివలింగంతోపాటు నంది విగ్రహాన్ని ఒక చోటికి చేర్చి గ్రామస్తులు పూజలు చేశారు. దేవాదాయ శాఖలో రిజిస్ట్రేషన్ చేసి, ఇక్కడ ఆలయ పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కవితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి, కంకటి ఉప్పలయ్యగౌడ్, గాదె ఆగారెడ్డి, బొల్లం సాంబమూర్తి, తులసీరాం, కంకటి ముక్తీశ్వర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

జాతరకు ముస్తాబైన నందిమేడారం

బయ్యారం: మండలంలో నందిమేడారంగా పేరున్న నామాలపాడు సమ్మక్క–సారక్క ఆలయం జాతరకు ముస్తాబైంది. జాతరకు జిల్లాలోని బయ్యారం, గార్ల, కురవి, డోర్నకల్, నెల్లికుదురు మండలాల వాసులతోపాటు భద్రాద్రి జిల్లా ఇల్లెందు, టేకులపల్లి, ఖమ్మం జిల్లా కారేపల్లి మండలాలకు చెందిన భక్తులు వచ్చి దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివాసీ సంప్రదాయ ప్రకారం ఆలయ నిర్వాహకులు తుర్సం సాంబలక్ష్మి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతర ప్రారంభమయ్యే 21వ తేదీన సారలమ్మ, 22న సమ్మక్క దేవతలు వనం నుంచి ఆలయ ప్రవేశం భక్తుల జయజయ ధ్వానాల నడుమ నిర్వహిస్తారు.



ముస్తాబైన ఆలయం

ఆధ్యాత్మిక జీవనంతో ప్రశాంతత

తొర్రూరు: ఈర్ష్య, అసూయతో సాధించేదేమి లేదని, ఆధ్యాత్మిక జీవనంతో ప్రశాంతత చేకూరుతుందని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ వరంగల్ సబ్ జోన్ డైరెక్టర్ సవిత అన్నారు. డివిజన్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టారు. భవన ప్రారంభోత్సవం అనంతరం సవిత మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత నేర్పించి ఉత్తమ సమాజ నిర్మాణానికి పాటుపడాలని సూచించారు. భవనానికి విలువైన స్థలాన్ని అందించిన స్థానిక వ్యాపారి బోనగిరి శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ భూసాని రాము, బ్రహ్మకుమారీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



కురవి: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కురవి: సీరోలు మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కొత్తూరు(సీ) జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపించారు. మొదటిస్థానంలో కొత్త జశ్వంత్, ద్వితీయ స్థానంలో సత్తి మేఘశ్యామ్ నిలిచారు. ఈమేరకు సోమవారం పాఠశాలలో విద్యార్థులను హెచ్ఎం ఇస్లావత్ లచ్చిరాం నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శీలం సుగుణాకర్, గుగులోతు భద్రు, అసోద రవికుమార్, రుద్రరాపు వెంకటాచలం, పాదిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మండలస్థాయిలో జరిగిన సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో ప్రతిభను కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం తండా ప్రభాకర్‌గౌడ్ సోమవారం తెలిపారు. మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన సుప్రియ, రషీద్‌లకు స్వీట్లు తినిపించి ఉపాధ్యాయులు అభినందించారు.

'సీతక్కను విమర్శించే స్థాయిలేదు'



గంగారం: మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి, అర్హత ఎవరికి లేదని కొత్తగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిళి అన్నారు. గంగారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం, ప్రజాసేవ కోసం పరితపించే నాయకురాలు మంత్రి సీతక్క అన్నారు. కాని ఆమెపై అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారని విమర్శించాడు. అక్రమ ఇసుక రవాణా చేస్తూ లారీలు పట్టుబడ్డాయని అభియోగాలు చేస్తున్న ప్రతిపక్ష నేతలు రుజువులు ఉంటే ముందుకు రావాలన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా సీతక్క మీద, ఆమె పీఏ సుజిత్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినీలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గార్ల: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ సూచించారు. సోమవారం గార్ల బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన పుష్పకుమారి, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శివ, హెచ్‌ఎం రత్నకుమార్, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, మంజుల, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, రేణుక, స్వప్న, అప్పయ్య పాల్గొన్నారు.

పశువైద్యుడిని నియమించాలి

- జీవాలకు అందని వైద్యం
- జబ్బు చేస్తే మండల కేంద్రానికి వెళ్లాల్సిందే..

దంతాలపల్లి: మండలంలో పెద్ద గ్రామమైన పెద్ద ముప్పారంలో పక్కనే ఉన్న రామానుజపురం గ్రామాన్ని కలుపుతూ పశువైద్యశాలను నిర్మించారు. నిర్మాణం జరిగాక కొన్ని సంవత్సరాలు లునావత్ శిరీషను వైద్యురాలిగా ప్రభుత్వం నియమించింది. ఈక్రమంలోనే ఆమె మరో చోటికి ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లారు. పక్క మండలమైన నెల్లికుదురు నుంచి పశువైద్యుడు వేణు డిప్యూటేషన్‌పై వచ్చి సంవత్సర కాలంపాటు సేవలు అందించాడు. ఆయన కూడా మూడు నెలల క్రితం వెళ్లిపోయాడు. దీంతో జీవాలకు జబ్బు చేస్తే పశువైద్యుడు లేక పోవడంతో మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువుల మందులు, నట్టల నివారణ మందులు రావట్లేదు, పశువులకు ఏదైనా జబ్బు చేస్తే పది కిలోమీటర్ల దూరం ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ పర్మనెంట్‌గా పశువైద్యుడిని నియమించాలని రైతులు కోరుతున్నారు.



పెద్దముప్పారంలోని పశువైద్యశాల

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పడమటిగూడెం గ్రామానికి చెందిన ఇర్రి లింగారెడ్డి స్నాక్స్ సోమవారం పంపిణీ చేశాడు. వార్షిక పరీక్షలు వస్తున్న తరుణంలో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా సుమారుగా రూ.4వేలతో స్నాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు యాదగిరి, కాస యాకయ్య, సతీష్ పాల్గొన్నారు.

యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

డోర్నకల్: యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేశ్‌యాదవ్ కోరారు. స్థానిక జైన్‌భవన్‌లో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ సమితి జిల్లా అధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ, జిల్లా యూత్ కన్వీనర్ దాసరి నానియాదవ్, మండల అధ్యక్షుడు మహేష్‌యాదవ్, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



నర్సింహులపేట: హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు



మహబూబాబాద్ రూరల్: మాధవాపురంలో..



పెద్దవంగర: బొమ్మకల్లు ఉన్నత పాఠశాలలో..

మహబూబాబాద్ రూరల్/పెద్దవంగర/నర్సింహులపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంలు సంకా బద్రి నారాయణ, రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు సంగీత, స్నేహలత, సుజాత, సౌభాగ్య, దుర్గయ్య, ప్రవీణ్, నాగరాణి, రాజేందర్, కృష్ణ, సురేష్, అమర్, భాస్కర్, రహ్మాన్, వహీద్‌పాషా, రమేష్‌బాబు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలయంలో హుండీ అపహరణ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో గల శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని చోరీ చేశారు. ఆలయ బాధ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి సోమవారం తెలిపాడు.

మార్కెట్లో మిర్చి బస్తా చోరీ: యువకుడికి దేహశుద్ధి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి బస్తా చోరీకి పాల్పడిన యువకుడిని గుర్తించి రైతులు సోమవారం దేహశుద్ధి చేశారు. వివరాలు.. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మధ్యాహ్నం సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడు ఒక మిర్చి బస్తా తీసుకెళ్లడాన్ని రైతులు గమనించారు. వెంటనే ఆ యువకుడిని ఆపి రైతులు మందలించి దేహశుద్ధి చేసి చేశారు.

విద్యుదాఘాతంతో తీవ్రగాయాలు

చిన్నగూడూరు: విద్యుదాఘాతంతో గీతకార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన గునిగంటి వీరన్న ఉపాధి కోసం హైదరాబాద్ శివారులోని తాడిచెట్లు ఎక్కి జీవనం సాగిస్తున్నాడు. వృత్తిలో భాగంగా సోమవారం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ప్రక్కనే ఉన్న తాటి కమ్మ కరెంట్ తీగలకు ఆనుకొని విద్యుత్ సరఫరా అయి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలవడంతో క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు.

వైద్యశిబిరం

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో మేడారం జాతర సందర్భంగా అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో హెల్త్‌క్యాంపును ఏర్పాటు చేశామని ఆరోగ్య విస్తరణ అధికారి ఒబిలిశెట్టి రామకృష్ణ సోమవారం తెలిపారు. క్యాంపులో డాక్టర్ రమ్య, సిస్టర్ అరుణ, ఆశ పద్మ, పాల్గొన్నారు.

కూలీల రక్షణ కోసం ఉద్యమించాలి

మరిపెడ రూరల్: ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి కూలీల రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘంలో చేరి ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గుండెపుడి గ్రామంలో ఇంటింటికి సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి సంఘం సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, రమేష్, లింగయ్య, సురేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని జగద్గురు గీతాశ్రమ 19వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని పూజ్య బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామీజీ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి 22వరకు మూడురోజులపాటు కనుల పండువగా వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపాడు.

ఒకరిపై గృహహింస కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శిఖారుఖానగడ్డ ప్రాంతానికి చెందిన బళ్లారి సుజాతను ఆమె భర్త రాకేష్ వేధింపులకు గురిచేయగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై గృహహింస చట్టం కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై డి.పవన్ కుమార్ సోమవారం తెలిపాడు.

వార్డెన్లపై చర్య తీసుకోవాలి

తొర్రూరు: వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలను పట్టించుకోని వార్డెన్లపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో ఏఓ నారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. మధు మాట్లాడుతూ.. హాస్టల్ వార్డెన్లు సమయపాలన పాటించడం లేదని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుమంత్, చరణ్, మహేష్, సోని పాల్గొన్నారు.

బైకులో దూరిన పాము

కేసముద్రం: ఓ రైతుకు చెందిన ద్విచక్రవాహనంలో పాము దూరిన సంఘటన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రం మార్కెట్‌లో మిర్చి అమ్మేందుకు ఓ రైతు తన బైక్‌పై వచ్చాడు. ఈక్రమంలో మిర్చి యార్డులో ఉన్న అతడి బైక్ ఇంజన్‌పై నుంచి లోపలికి పాము వెళ్తుండగా, అక్కడున్న వారంతా గమనించి కేకలు పెట్టారు. దీంతో పామును బయటకు రప్పించేందుకు రైతులు, మార్కెట్ సిబ్బంది ప్రయత్నాలు చేశారు. సుమారు అరగంట తర్వాత బైక్‌లోకి దూరిన పాము బయటకు రావడంతో, దాన్ని కర్రతో కొట్టి చంపేశారు.

బియ్యం అందజేత

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన కొర్ని వెంకన్న నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంకటలక్ష్మి రైస్ మిల్లు యజమాని ఈశ్వర్ రావు సోమవారం బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం, ఇతర సామగ్రి అందజేశాడు.

యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

గార్ల: తెలుగు రాష్ట్రాల్లో సేవాలాల్ ఆన్‌లైన్ అకాడమీ యాప్‌ను నిరుపేద నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని కోచింగ్ సెంటర్ సీనియర్ ఫ్యాకల్టీ అయిన భూక్యా వల్లీనాయక్ సూచించారు. ఈమేరకు సోమవారం గార్లలో ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ చేతుల మీదుగా సేవాలాల్ ఆన్‌లైన్ అకాడమీ యాప్ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్‌లాల్, మాజీ ఉపసర్పంచ్ మల్లిబాబు, కాంగ్రెస్ నాయకులు యాకూబ్‌పాషా, రామ్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురవి: కురవిలో నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ బి.శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డీఆర్‌ఓ పురుషోత్తం అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమానికి డీఆర్‌ఓ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ రామా రత్నమాల, అడిషనల్ డీఆర్‌డీఏ అధికారి సురేష్, అధ్యాపకులు మమత, యుగంధర్, బొంద్యాలు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురుషోత్తం